స్కౌట్స్ లక్ష్యం క్రమశిక్షణ, దేశభక్తి

విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యత, దేశ భక్తి, పరమత సహనం, జాతీయ సమైక్యత పెంపొందించడమే లక్ష్యంగా పనిచేస్తోంది ×భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్. తమ విద్యుక్త ధర్మం నెరవేర్చుతూనే దేవుడికి, దేశానికి, సమాజానికి సేవ చేసేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే ఈ సంస్థ సూత్రం. ఇందులో భాగంగా ఇటీవల శిక్షణ పొందిన కొందరి అభిప్రాయాలతో కథనం.


శిక్షణ ఇస్తున్న స్కౌట్ మాస్టర్లు

మదనపల్లె సిటీ: మదనపల్లె జ్ఞానోదయ పాఠశాలలో ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ జరిగింది. రెసిడెన్షియల్ విధానంలో జరిగిన ఈ శిక్షణకు మదనపల్లె డివిజన్‌కు చెందిన 46 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ శిబిరంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రవేశ్, ప్రథమ, ద్వితీయ, తృతీయ సోపాన్, చతుర్థ చరణ్, గోల్డన్ యారోలకు సంబంధించిన కోర్సులు, పాఠశాల స్థాయి నుంచి క్రమశిక్షణ, సమాజంపై అవగాహన, నాయకత్వ లక్షణాలు, ఆటపాటలతో కూడిన శిక్షణ, పిల్లల్లో సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం అంశాలపై వక్తలు శిక్షణ ఇచ్చారు. శారీరక ధృడత్వం, జీవన నైపుణ్యాలను నేర్చుకోవడం, సమాజ సేవా భావాన్ని పెంపొందించడం, వ్యక్తిగతవృద్ధికి అవసరమైన అంశాలను శిక్షణలో వివరించారు.

పలు కోర్సుల్లో శిక్షణ



ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కార్యక్రమం జరిగింది. చాలా ఉత్సాహంగా పాల్గొన్నాం. ప్రవేశ్, ప్రథమ్, ద్వితీయ, తృతీయ సోపాన్‌లకు సంబంధించిన కోర్సుల్లో శిక్షణలో ఇచ్చారు.

– భార్గవి, ట్రైనీ, టీచర్, చీకలబైలు, మదనపల్లె

స్కౌట్స్‌తో ఉత్తమ జీవన విధానం



స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో క్రమశిక్షణ, ఉత్తమ జీవన విధానం, మానవ మానవీయ విలువలు సాధ్య పడుతాయని శిక్షణలో గుర్తించాం. పాఠశాల స్థాయి నుంచి స్కౌట్స్ అండ్ గైడ్స్ నేర్చుకోవడంతో విద్యార్థులలో మంచి విలువలు కలిగి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడుతారు.

– పి.మహమ్మద్‌ఖాన్, స్కౌట్ మాస్టర్, జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె

సేవాభావాన్ని పెంపొందించడమే లక్ష్యం



విద్యార్థి దశ నుంచే సమాజంపై సేవాభావాన్ని పెంపొందించడమే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ లక్ష్యం. ఇందులో భాగంగా నిర్వహిస్తున్న క్యాంపులో ఒక్కో అంశంపై సమగ్రంగా శిక్షణ ఇచ్చాం. ఆరోగ్యం, ప్రథమ చికిత్స, పరిశుభ్రత, టీం వర్క్, అంశాలపై వివరించాం. అందరూ ఆసక్తిగా శిక్షణలో పాల్గొన్నారు.

– ఉమాపతి, కోర్సు లీడర్

క్లుప్తంగా

హెచ్ఆర్‌సీకి కొత్త శాస్త్రవేత్తలు

బి.కొత్తకోట: మండలంలోని బయ్యప్పగారిపల్లి హార్టికల్చర్ పరిశోధనా కేంద్రంలో పనిచేస్తున్న బాలాహుస్సేన్‌ను తాడేపల్లిగూడెం, శేష కిరణ్‌ను బయో ఫర్టిలైజర్స్ విభాగానికి ఇన్‌ఛార్జిగా ఇటీవల బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఆగ్రానమి సీనియర్ శాస్త్రవేత్త బి.ప్రతాప్(ఫీల్డ్ మేనేజ్‌మెంట్), హార్టికల్చర్ సైంటిస్ట్ జి.పూర్ణదత్తారెడ్డి బుధవారం బయప్పగారిపల్లి హెచ్ఆర్‌సీకి నియమితులయ్యారు.

టెలికాం నూతన సభ్యుడిగా దామోదర్ రెడ్డి


దామోదర్ రెడ్డి

కురబలకోట: ఉమ్మడి చిత్తూరు జిల్లా కమిటీ బీఎస్ఎన్ఎల్ టెలికాం సలహా సభ్యుడి(టీఎసీ)గా మండలంలోని అంగళ్లుకు చెందిన ముత్ర దామోదర్ రెడ్డిని నియమించారు. ఈ మేరకు బీఎస్ఎన్ఎల్ తిరుపతి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆయనకు నియామకపత్రం పంపారు. దామోదర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుండి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కొనసాగుతున్నారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సిఫారసు చేయడంతో ఆయనను నియమించారు. దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ టెలికమ్యూనికేషన్ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

బి.కొత్తకోట: పట్టణంలోని జ్యోతి చౌక్, పరిసరాల్లో రోడ్డుపై ఏర్పాటు చేసుకున్న దుకాణాలను కమిషనర్ పల్లవి, మేనేజర్ రమాదేవి ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. ఇటీవల ఈ రోడ్డులో ఆక్రమణలు తొలగించినా.. మళ్లీ ఆక్రమించి పూల అంగళ్లు, ఇతర దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో అధికారులు దుకాణ సామగ్రిని తొలగించి ట్రాక్టర్‌లో తరలించారు.

కనీస వేతనం ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివ

పీలేరురూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, వాచ్ మెన్‌లకు 108 జీవో ప్రకారం రూ.11,500 వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయాలు, వాచ్‌మెన్‌లను ఆప్కాస్‌లో చేర్చాలన్నారు. ఫిబ్రవరి 9న నిర్వహించనున్న జిల్లా ఆయాల జనరల్‌బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి నరసింహులు, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, ఆయాలు యశోద, నూర్జహాన్, రత్నమ్మ, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


రికార్డులు తనిఖీ చేస్తున్న లక్ష్మణ్ నాయక్

గుర్రంకొండ: దోమల నుంచి వ్యాపించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని రాయచోటి జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మణ్ నాయక్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ల్యాబ్‌ను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలన్నారు. మురుగునీటి నిల్వలు, ఆపరి శుభ్ర పరిసరాలుంటే విక్టర్ కంట్రోల్ హైజెనిక్ యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేసి పంచాయతీ కార్యదర్శికి తెలియజేయాలన్నారు. గ్రామాల్లో నిత్యం తిరిగే ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బంది దోమల ద్వారా వచ్చే డెంగీ, మలేరియా జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రవీంద్రనాయక్, జోనల్ హెల్త్ విస్తరణాధికారి నిత్యపూజయ్య, మహబూబ్‌బాషా, సీహెచ్‌వో సీతా రామయ్య, హెల్త్ సూపర్‌వైజర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను పిలవకుండా ప్రారంభోత్సవాలకు సిద్ధం?

బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో పూర్తి చేసిన ఇళ్లను ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రెండు చొప్పున గృహ ప్రవేశాలు చేయించాలని గృహనిర్మాణ శాఖ అధికారులు నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని ఆహ్వానించాల్సి ఉంటుంది. అయితే గృహ నిర్మాణశాఖ అధికారులు ప్రొటోకాల్‌ను పక్కన పెట్టి టీడీపీ నాయకులతో ప్రారంభోత్సవాలు చేయించాలనే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యేను ఆహ్వానించకపోతే ప్రొటోకాల్‌ను అధికారులు ఉల్లంఘించినట్టే. అసెంబ్లీ నైతిక విలువల కమిటీ.. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది

శ్రమ దోపిడీపై సమగ్ర దర్యాప్తు చేయాలి


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

మదనపల్లె: మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికుల శ్రమ దోపిడీపై సమగ్ర దర్యాప్తు చేసి, వాస్తవాలు నిగ్గుతేల్చాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయూ)అధ్యక్ష, కార్యదర్శులు చలపతినాయుడు, సాంబశివనాయక్ డిమాండ్ చేశారు. మీడియాతో బుధవారం వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్మికులను దోపిడీకి గురిచేస్తున్న శానిటరీ అధికారులపై ధ్వజమెత్తి, కార్మిక సమస్యలను కౌన్సిల్‌లో ప్రస్తావించిన వైస్ చైర్మన్ జింకా చలపతికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సెలవులు ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. అనివార్యకారణాలతో విధులకు గైర్హాజరయితే, వేతనాలు ఖాతాకు జమచేసి, తిరిగి వసూలు చేసుకుంటూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. అలాగే కార్మికుల జీతాలకు సంబంధించి సెక్షన్ ఆఫీసర్లతో లాలూచీపడి, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అందరిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని కోరారు. మున్సిపల్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని, సీఐటీయూ తరపున కార్మికుల పక్షాన పోరాటాలకు తాము సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి రామకృష్ణ రాజు, అరవింద్‌గోపాల్, చంద్ర, శంకర్‌నాయక్, ఎం.కృష్ణప్ప, బాలకృష్ణ, చిన్నరెడ్డెప్ప, శ్రీరాములు, మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో సంఘాల ఏర్పాటు


మాట్లాడుతున్న ఉపాధి హామీ ఏపీడీ మధుబాబు

తంబళ్లపల్లె: మండలంలో ప్రతి గ్రామంలోనూ ఉపాధి కూలీలతో సంఘాలు ఏర్పాటు చేయాలని ఉపాధి హామీ ఏపీడీ మధుబాబు తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం ఉపాధి సిబ్బందితో జరిగిన సమావేశంలో ఏపీడీ మాట్లాడుతూ 25 మంది ఉపాధి కూలీలతో ఒక్కో సంఘాన్ని ఏర్పాటు చేయాలని, ఒక మేట్‌ను నియమించాలన్నారు. మేట్‌కు ఒకొక్క కూలీపై 1.50 పైసలు అందజేయడం జరుగుతుందన్నారు. ఆ మేట్ వంద రోజులు పని పూర్తి చేసుకుంటే ఒక్కో కూలీపై రూ.3 ఆదాయం వస్తుందన్నారు. గోకులం షెడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ఐదు రోజుల్లోపు పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీఓ అంజనప్ప, మండల టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రాజగోపురం ప్రతిష్టకు అంకుర్పారణ


అంకుర్పారణ చేస్తున్న వేదపండితులు

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో రాజగోపురం ప్రతిష్ట మహోత్సవానికి బుధవారం అంకుర్పారణ చేశారు. ఆగమశాస్త్రం ప్రకారం అర్చకులు కృష్ణప్రసాద్ భట్టార్, రమేష్‌బాబు, ధనుష్ శాస్త్రోక్తంగా వేదమంత్రాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీటీడీ డిప్యూటీ ఈఓ గోపీనాథ్, ఇన్స్‌పెక్టర్ దుష్యంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ అధికారులను నియమించేలా చూడండి

రాయచోటి అర్బన్: జిల్లాలో ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖలలో పనిచేస్తున్న ఇన్‌చార్జ్ జిల్లా అధికారుల స్థానంలో రెగ్యులర్ అధికారులను నియమించేలా చూడాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న కోరారు. బుధవారం రాయచోటిలో ఆయనను కలుసుకుని మాట్లాడారు. జిల్లాలో ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖలలో రెగ్యులర్ అధికారులు లేక ఇన్‌చార్జ్‌ల పాలన కొనసాగుతోందన్నారు. పీలేరు, రాయచోటి ఏఎస్‌డబ్ల్యూఓగా పనిచేస్తున్న అధికారిని ఎస్సీ సంక్షేమశాఖకు జిల్లా ఇన్‌చార్జ్ అధికారిగా కొనసాగుతున్నారన్నారు. బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారిగా రాయచోటికి రాజంపేటలకు చెందిన ఏఎస్‌డబ్ల్యూఓ కొనసాగుతున్నారన్నారు.మంత్రికి వినతిపత్రం అందజేశారు.

రెవెన్యూలో భూ మాయాజాలం

రెవెన్యూ అధికారుల అలసత్వమో.. నిర్లక్ష్యమో.. మరి రైతులకు అవస్థలు తప్పడం లేదు. బాధ్యత లేని అధికారుల కారణంగా ఓ రైతు తన భూమిని తాను దక్కించుకునేందుకు అపసోపాలు పడాల్సి వస్తోంది. ఓ బ్యాంకులో మార్టిగేజ్ చేసినపుడు ఆన్‌లైన్‌లో ఉన్న తన భూమి వివరాలు ఇప్పుడు లేకపోవడం, మరో రైతు పేరు నమోదు కావడంతో దిక్కు తోచని స్థితిలో పడ్డాడు. లేని భూమి అధికంగా ఉన్నట్లు చూపడం..తన భూమి వివరాలు లేకపోవడం ఏమిటంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాడు. బాధిత రైతు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.

- ఉన్న భూమి లేనట్లు ఆన్‌లైన్‌లో నమోదు
- మార్టిగేజ్ భూమి రిజిస్ట్రేషన్‌కు అవస్థలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని సంపతికోట పంచాయతీ ముంతపోగులవారిపల్లికి చెందిన రైతు ఎం.రవీంద్రారెడ్డి గతంలో తనకున్న భూమిని ఐసీఐసీఐ బ్యాంకులో మార్టిగేజ్ చేసి రూ.5 లక్షల రుణం పొందాడు. నెలరోజుల క్రితం రుణానికి సంబంధించి వడ్డీతో సహా అప్పును ఆ బ్యాంకుకు జమ చేశాడు. అప్పు తీర్చడంతో మార్టిగేజ్ చేసిన భూమిని తిరిగి తన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు బ్యాంకర్లతో కలిసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాడు.

ఆన్‌లైన్ వివరాల్లో తప్పులు

రైతు తన భూమి మార్టిగేజ్ చేసే సమయంలో సమర్పించిన భూ సంబంధిత ఆన్‌లైన్ వివరాలకు, ఇప్పటి ఆన్‌లైన్ వివరాలకు పొంతన లేకపోవడం చూసి రైతు ఆశ్చర్యం వ్యక్తం చేసుత్నాడు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో గతంలో ఉన్న విస్తీర్ణం కన్నా ప్రస్తుతం ఎక్కువ భూమి ఆన్‌లైన్‌లో చూపి ఉండడం, అంతేగాక సర్వే నంబర్ 155–బి లోని 10 సెంట్ల భూమి వివరాలు మరో రైతు పేరిట నమోదు కావడం వంటి తప్పులు కనిపించాయి. దీంతో తాము రిజిష్టర్ చేయలేమని సబ్ రిజిస్ట్రార్ అధికారులకు తేల్చి చెప్పడంతో రైతు నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది.

అర్జీ ఇచ్చుకో...పో

తన భూమి విషయంలో లోపాలను విలేజ్ సర్వేయర్ అయ్యప్పరెడ్డి దృష్టికి రైతు తీసుకెళ్లగా ఎమ్మార్వో ఆఫీసుకు పోయి అర్జీ ఇచ్చుకో పో.. నా చేతుల్లో ఏం లేదు అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడని రైతు రవీంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రీ సర్వే చేయడానికి వచ్చింది మీరే.. మా ఊళ్లో భూములను మీరే కొలతలు వేసారు కదా.. అధికారులందరూ కలిసి నా భూముల వివరాలు ఎందుకు తారుమారు చేసారు అంటూ ప్రశ్నించగా.. సర్వేయర్ కూడా ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నాడని రైతు అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి రైతులు నిత్యం పదుల సంఖ్యలో అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

రీ సర్వేలో కొన్ని తప్పులున్నాయి

రీసర్వే సమయంలో కొన్ని చోట్ల తప్పిదాలు జరిగాయి. రైతు రవీంద్రారెడ్డి కరెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే భూముల వివరాలు సమగ్రంగా మార్పులు చేర్పులు చేస్తాం. – శ్రీరాములు నాయక్, తహసీల్దారు

ఇంటర్వ్యూలు వాయిదా

మదనపల్లె: రెవెన్యూ డివిజన్ పరిధిలో రేషన్ షాపు డీలర్ల భర్తీకి ఈ నెల 27వ తేదీ నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే అన్నమయ్య జిల్లాలో సీఎం చంద్రబాబునాయుడు పర్యటన ఉండడంతో ఈ నెల 30, 31వ తేదీల్లో సబ్ కలెక్టరేట్‌లో జరగాల్సిన రేషన్ డీలర్ల ఇంటర్వ్యూలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు డీఏఓ రాఘవేంద్ర బుధవారం మీడియాకు తెలిపారు. తదుపరి ఇంటర్వ్యూ తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు.

పశువైద్య శిబిరం

ములకలచెరువు: మండలంలోని మళిగివారిపల్లెలో బుధవారం వెటర్నరీ వైద్యులు పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 85 ఆవులు, 25 దూడలు, 900 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించామని వైద్యురాలు బి.నివేదిత అన్నారు. 110 పశువులకు పిడుదుల మందు పిచికారీ చేయించామన్నారు. పల్లెలలో నిర్వహించే పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్నేహభావంతో మెలగాలి

ములకలచెరువు: కస్తూర్బా పాఠశాల సిబ్బంది విద్యార్థులతో స్నేహభావంగా మెలగాలని చైల్డ్ వెల్ఫేర్ జిల్లా అధికారిణి షకీలా, సీడీపీఓ భాగ్యమ్మ, హ్యూమన్ రైట్స్ చైర్మన్ వేణుగోపాల్ అన్నారు. బుధవారం వారు పాఠశాలను సందర్శించారు. విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు.

ఘనంగా గంగమ్మకు పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న గ్రామస్థులు


గంగమ్మ

రామసముద్రం: మండలంలోని ఎర్రప్పల్లె గ్రామంలో పశువుల పండుగ సందర్భంగా బుధవారం గంగమ్మకు గ్రామస్థులు జ్యోతులు మోశారు. గ్రామం చుట్టూ ఉన్న అమ్మవార్లకు పూజలు చేసి మహిళలు జ్యోతులు మోశారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. గ్రామం బంధుమిత్రులతో కళకళలాడింది.

నేడు దిగువమాచిరెడ్డిగారి పల్లెలో సివిల్ రైట్స్ డే

నిమ్మనపల్లె: మండలంలోని దిగువ మాచిరెడ్డిగారిపల్లెలో గురువారం పౌర హక్కుల పరిరక్షణ దినోత్సవం(సివిల్ రైట్స్ డే) నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు కె.ధనుంజయులు తెలిపారు. ప్రతి నెలా 30వ తేదీన మండలంలోని గ్రామాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహిస్తున్నామని తెలిపారు. వివిధ శాఖల అధికారులు, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు అధ్యక్షుల ఎంపిక

మదనపల్లె సిటీ: మదనపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ప్రకటించింది. యువత అధ్యక్షుడిగా డి.హర్షవర్ధన్ రెడ్డి ఎంపికయ్యారు. **మహిళా విభాగం:** టి.మేరీ, **రైతు విభాగం:** జె.రాజేంద్ర నాయుడు, **బిసి సెల్:** బి.ఆనంద్, **ఎస్‌సి సెల్:** కె.ప్రసాద్‌బాబు, **ఎస్టీ సెల్:** పి.ఈశ్వరనాయక్, **మైనార్టీ సెల్:** మహమ్మద్‌యూనస్, **క్రిస్టియన్ మైనార్టీ సెల్:** రిచర్డ్ క్రిస్టఫర్ అలెగ్జాండర్, **విద్యార్థి విభాగం:** ఆర్.అశోక్‌కుమార్, **పంచాయతీరాజ్ విభాగం:** కె.రెడ్డిశేఖర్ రెడ్డి, **మున్సిపల్ విభాగం:** బి.ఎ.ఖాజాహుస్సేన్, **ఆర్‌టీఐ వింగ్:** ఎం.చంద్రశేఖర్, **వలంటీర్ల విభాగం:** కత్తి మంజునాథ్, **గ్రీవెన్స్ సెల్ విభాగం:** పి.నాగరాజు, **వాణిజ్య విభాగం:** ఎం.నూర్ మహమ్మద్‌ఖాన్, **చేనేత విభాగం:** వై.అశోక్, **వైఎస్సార్‌టీయూసీ విభాగం:** పి.శివశంకర్, **అంగన్‌వాడీ విభాగం:** ఈ.వసంత, **లీగల్‌సెల్:** డి.ప్రసాద్‌రెడ్డి, **కల్చరల్ విభాగం:** కె.ఈశ్వర్, **సోషియల్ మీడియా:** కె.సోమశేఖర్, **ఐటీ వింగ్:** డి.అరవింద్ తిలక్, **దివ్యాంగుల విభాగం:** టి.గిరిబాబు, **డాక్టర్ల విభాగం:** ఎ.మహేష్‌బాబు, **మేధావుల విభాగం:** షేక్ ముబసిర్ అహ్మద్, **బూత్‌కమిటీ:** ఎ.మునిశేఖర **పబ్లిసిటీ విభాగం** అధ్యక్షులుగా కె.నాగరాజును నియమించినట్లు తెలిపారు.

ప్రభుత్వం ద్వారానే సమగ్రాభివృద్ధి

సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు


మాట్లాడుతున్న శ్రీనివాసులు

మదనపల్లె: ప్రభుత్వంతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని, ఇందుకు తగిన జవాబుదారీతనం, స్పష్టమైన ప్రణాళిక, నిర్దిష్టమైన కార్యాచరణ అవసరమని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా సమగ్రాభివృద్ధి–ప్రత్యామ్నాయ విధానాలపై బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ...ప్రైవేటు రంగంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామంటూ పాలకులు చెబుతున్న మాటలు ఆచరణ సాధ్యం కావన్నారు. ఇప్పటి వరకూ ప్రపంచంలో ఎక్కడా అలా జరగలేదని, పెట్టుబడిదారులతో సీఎం చంద్రబాబు దావోస్ వెళ్లి ఒప్పందాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో ఎన్నో సార్లు చేసుకున్న ఇలాంటి ఒప్పందాలు ఫలప్రదమైన సందర్భాలు చాలా తక్కువని గుర్తు చేశారు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెంచకుండా ఎన్ని కొత్త పరిశ్రమలు వచ్చినా ఏ ప్రయోజనం ఉండదన్నారు. ప్రణాళిక రూపొందిస్తే వాస్తవికంగా ఉండాలని, విజన్ 2047లో అనుసరించిన ×వాటర్ ఫాల్‌ె విధానం సరైంది కాదన్నారు. వందల కోట్ల స్థాయిలో ఖర్చు చేసి అసంపూర్తి పనులకు నిధులు కేటాయిస్తే రాయలసీమకు సాగునీరొస్తుందనే విషయాన్ని విస్మరించి గోదావరి –భనకచర్ల ప్రాజెక్టు చేపడతామనడం రాయలసీమ ప్రజలను మభ్యపెట్టడమేనన్నారు. కేటాయించిన భూములను ఆయా సంస్థలు బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు పొంది, ఎగనామం పెడుతున్నారని చెప్పారు. కడప బెంగళూరు రైల్వే లైన్ పూర్తి చెయ్యాలని, హంద్రీ నీవా కాల్వ వెడల్పు చేసి లైనింగ్ పనులు చేపట్టాలని, నికర జలాలు కేటాయించాలని కోరారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి ప్రత్యామ్నాయ ప్రణాళిక త్వరలో జరగనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలో ప్రవేశపెట్టి చర్చించడం జరుగుతుందన్నారు. హరిశర్మ, ప్రభాకర్ రెడ్డి, రఘునాథ్, రాజమ్మ, రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

ఫిబ్రవరిలో ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ పరీక్ష

మదనపల్లె సిటీ: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 1, 2వ తేదీల్లో ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్, ఎథిక్స్ హ్యూమన్ వాల్యూస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలకృష్ణమూర్తి తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సైన్సు, ఒకేషన్ విద్యార్థులకు ఫిబ్రవరి రెండో వారంలో ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు పరీక్షలకు తప్పకుండా హాజరు కావాలన్నారు.

104 వైద్య సేవలు సద్వినియోగం చేసుకోండి


రికార్డులు తనిఖీ చేస్తున్న డీసీ డాక్టర్ లోకవర్ధన్

పీలేరు రూరల్: 104 సంచార వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని డీసీ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. మండలంలోని తలపుల పీహెచ్‌సీ పరిధిలోని చెరుకువారిపల్లెలో 104 వైద్య సేవలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక రోగులకు నెలకు సరపడా మందులు అందిస్తున్నట్లు తెలిపారు. 104లో అన్ని రకాల మందులు, ఈసీజీ సౌకర్యం ఉన్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు చేసే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలి

డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి


రికార్డులను తనిఖీ చేస్తున్న అమరనాథరెడ్డి

నిమ్మనపల్లె: సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాచవేటివారిపల్లె, రెడ్డివారిపల్లె సచివాలయాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ రికార్డులతోపాటు సిబ్బంది మూమెంట్ రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయానికి హాజరు వేయాలన్నారు. ప్రతి ఉద్యోగి ఇంటికి వెళ్లి సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉద్యోగులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అధికారుల అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డమ్మ నరేంద్రరెడ్డి, మారెప్ప, గాయత్రి, నాగభూషణం, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవా పురస్కార గ్రహీతలకు సన్మానం


తహసీల్దారును సన్మానిస్తున్న రెడ్డమ్మ, అధికారులు


ఎంఈఓ రెడ్డిశేఖర్‌ను సన్మానిస్తున్న స్నేహితులు

నిమ్మనపల్లె: ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న తహసీల్దారు కె.ధనుంజయులును రెడ్డివారిపల్లె సచివాలయంలో సర్పంచ్ నూతనకాల్వ రెడ్డమ్మ, నరేంద్రరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు గాయత్రి, నాగభూషణం, సచివాలయ సిబ్బంది బుధవారం ఘనంగా సత్కరించారు. ధనుంజయులు మాట్లాడుతూ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకోవడంతో విధులలో తన బాధ్యత మరింత పెంచిందన్నారు. వైస్ ఎంపీపీ జయప్రకాశ్ రెడ్డి ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాంప్రసాద్, హేమాంబర్ రెడ్డి, నాగరాజు, చిన్న రెడ్డప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఎంఈవోకు....

మదనపల్లె: కలెక్టర్ చామకూరి శ్రీధర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న బి.కొత్తకోట ఎంఈఓ రెడ్డిశేఖర్‌ను ఆయన స్నేహితులు బుధవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని నిమ్మనపల్లె సర్కిల్‌లో ఎంఈఓ రెడ్డిశేఖర్‌ను, మదనపల్లె డివిజన్ మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులు నాయుడు, సహ జీవన్‌బాబు, కునకుంట్ల చలపతి, ఉమేష్ నాయుడు ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ సమాజంలో తల్లిదండ్రుల తర్వాత గురువుకు విశిష్ట స్థానం ఉందని, ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి, ఉన్నత స్థానాలకు చేరేందుకు కృషి చేసిన రెడ్డిశేఖర్ పురస్కారం అందుకోవడం తమకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో కంచర్ల చింటూ, డాక్టర్ కుమార్, పెరవలి మధు, దామోదర్‌నాయుడు, సురేంద్ర, రాటకొండ ఉషారాణి, మహేష్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలు సాకారం చేసుకోవాలి


కుళాయి ప్రారంభిస్తున్న కనుగొండ మద్దిరెడ్డి

తంబళ్లపల్లె: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని మల్లయ్యకొండ మాజీ చైర్మన్, పారిశ్రామికవేత్త కనుకొండ మద్దిరెడ్డి అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోరిక మేరకు రూ.50 వేల సొంత నిధులతోలాయన పైప్‌లైన్ ఏర్పాటుచేయించారు. పూర్తయిన అనంతరం పాఠశాలలో బుధవారం కుళాయిలను ప్రారంభించారు. గతంలోను పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సహకారం అందిచారని హెచ్‌ఎం శ్రీనివాసులు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పసుపులేటి చలపతి, ఎస్ఎంసీ చైర్మెన్ శివకుమార్, వైస్ ఎంపీపీ కరీమ్, రెడ్డి సంఘం నాయకులు రామమోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, పునీత్ కుమార్, ఉపాధ్యాయులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.